క్లుప్తంగా

సఫాయి కార్మికులకు అవగాహన



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎఫ్‌సీఐ ఉద్యోగులు

నల్లగొండ: స్వచ్ఛతా హీ సేవ-సఫాయిమిత్ర సురక్ష శివిర్‌లో భాగంగా ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో సఫాయి కార్మికులకు మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ మేనేజర్ ఆదిమల్ల శంకర్ సఫాయి కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది సతీష్‌రెడ్డి, శ్రీను, వెంకన్న, మహేశ్వరి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో యశస్ చంద్రిక ప్రతిభ



చిట్యాల: ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన అర్రూరి జానయ్య-సంధ్య దంపతుల కూతురు యశస్ చంద్రిక మంగళవారం విడుదలైన యూజీసీ సీఎస్ఐఆర్ ఫలితాల్లో పీహెచ్‌డీ అర్హత సాధించింది. ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో బయో కెమిస్ట్రీ విభాగంలో యశస్ చంద్రిక పదో ర్యాంక్ సాధించింది.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

నాంపల్లి: మండలంలోని తుంగపహాడ్ గ్రామంలో ఇటీవల నీల శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుటుంబాన్ని నాంపల్లి మండల యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నేతల కొండల్‌యాదవ్ పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఏఎస్‌ఓ ఉద్యోగం సాధించిన పంచాయతీ కార్యదర్శి



వెల్మకంటి వేణు

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల జీపీ పరిధి అక్కలాయిగూడెంకు చెందిన వెల్మకంటి వేణు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 231 ర్యాంకు సాధించి ఏఎస్‌ఓ(జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)గా ఎంపికయ్యాడు. వేణు 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించి ప్రస్తుతం చండూరు మండలం శిర్దేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు.


నాలుగు ఉద్యోగాలు సాధించిన నారెగూడెం వాసి



జనార్దన్‌రెడ్డి

కట్టంగూర్ : మండలంలోని నారెగూడెం గ్రామానికి చెందిన రావుల మల్లారెడ్డి-సత్తెమ్మ దంపతుల కుమారుడు జనార్దన్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 78వ ర్యాంకు సాధించి గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యాడు. జనార్దన్‌రెడ్డి ప్రస్తుతం నల్లగొండలో కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2019లో పంచాయతీ సెక్రటరీగా, 2025 జనవరిలో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. గ్రూప్-3లో 108వ ర్యాంకు సాధించగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కాలేదు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడు వెంకటసాయికి సన్మానం



వెంకటసాయిని సన్మానిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : జిల్లాకు చెందిన ఛత్రపతి శివాజీ ఫుట్‌బాల్ క్లబ్ క్రీడాకారుడు రాచూరి వెంకటసాయి ఇటీవల ఆసియా ఫుట్‌బాల్ స్పెషల్ ఎక్స్‌పోజర్ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా వెంకటసాయిని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం సన్మానించారు. ఫుట్‌బాల్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫల్గుణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దారి ఇలా.. ప్రయాణించేది ఎలా!

- గుంతలు, బురదమయంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న మోదినిగూడెం వాసులు
- బీటీ రోడ్డు నిర్మించాలని వేడుకోలు



అధ్వానంగా ఉన్న మోదినిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు



మోదినిగూడెం - గోరెంకలపల్లి మధ్యలో..

నకిరేకల్ : గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పల్లెలకు వెళ్లే దారులు గుంతలు, బురదమయంగా మారడంతో రాకపోకల విషయంలో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకించి నకిరేకల్ మండలం మోదినిగూడెం గ్రామ ప్రజలు అస్తవ్యస్త రోడ్డు గుండా రాకపోకలు సాగించాలంటే హడలిపోతున్నారు. గతంలో నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఈ గ్రామం.. కొత్త గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. శివారు గ్రామం నుంచి గ్రామ పంచాయతీగా ఏర్పాటు అయినప్పటికీ ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదు.

అధికారులను నిర్బంధించి నిరసన..

మోదినిగూడెం గ్రామంలో మొత్తం జనాభా 750 కాగా.. 600 మంది వరకు ఓటర్లు ఉంటారు. ప్రధానంగా తిప్పర్తి వైపు వెళ్లే రోడ్డు నుంచి గ్రామానికి వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో మోదినిగూడెం ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గ్రామానికి వచ్చే రోడ్డును బీటీగా మార్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ గతంలో ప్రజా పాలన సమయంలో గ్రామానికి వచ్చిన అధికారులను పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు.

గతంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన..

తిప్పర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి, అదేవిధంగా గోరెంకలపల్లి గ్రామం నుంచి దాదాపు రెండు కిలోమీటర్లు మేర మోదినిగూడెంకు రెండు దారులు ఉన్నాయి. ఈ రెండు దారుల్లో నకిరేకల్ వైపు వెళ్లే ఒక రోడ్డును బీటీగా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.1.50 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు వెనక్కిపోయాయి. మోదినిగూడెం గ్రామ ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం నకిరేకల్, తిప్పర్తి మండల కేంద్రాలకు వెళ్లి వస్తుంటారు. ఈ గ్రామానికి ఉన్న రెండు దారులు గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలిచి ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తిప్పర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామానికి వచ్చే రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రెండు దారుల్లో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి రాకపోకల సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేయాలి



తిప్పర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మా గ్రామానికి వచ్చే రెండు కిలోమీటర్ల మేర ఉన్న రెండు దారులు అధ్వానంగా ఉన్నాయి. గుంతలు ఏర్పడడంతో అందులో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ రెండు దారుల్లో సీసీ నిర్మిస్తే ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– అనుమల నాగేందర్, మోదినిగూడెం

ప్రతిపాదనలు పంపాం

తిప్పర్తి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మోదినిగూడెం వరకు నకిరేకల్ వైపు వచ్చే రెండు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును బీటీగా మార్చేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం సూచన మేరకు రూ.2 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ, నకిరేకల్

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించండి



చిట్యాల: మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రావణ్‌కుమార్

చిట్యాల: చదువు మధ్యలో మానేసిన వారిని ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చిట్యాల మండల ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలపై మంగళవారం ఉపాధ్యాయులకు, వీఓఏలకు, ఐసీడీఎస్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ జయలక్ష్మి, ఎంఈఓ సైదానాయక్, ఏపీఎం శ్రీదేవి, హెచ్‌ఎంలు రాంమోహన్, శ్రీనయ్యచారి, వెంకట్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించండి

నకిరేకల్ : చదువు మధ్యలో మానేసినవారు ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించేలా అవగాహన కల్పించాలని నకిరేకల్ మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. నకిరేకల్ ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మహిళా సమాఖ్య ప్రతినిధులకు జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువు మధ్యలో మానేసి 14 ఏళ్ల పైన ఉన్న వారు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు రాసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ప్రతి గ్రామానికి కనీసం 10 అడ్మిషన్లు టార్గెట్ పెట్టుకుని చేర్పించాలన్నారు. ఎంఈఓ మేక నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీఎం ప్రభాకర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నార్కట్‌పల్లి : చదువు మధ్యలో మానేసినవారు ఇంటి వద్దనే చదువు పూర్తిచేసుకునే చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నార్కట్‌పల్లి మండల ప్రత్యేక అధికారి గంజి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలు, ఐకేపీ సీసీలు, వీఓఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 14 సంవత్సరాల వయస్సు దాటి 10వ తరగతి పూర్తి చేయలేని వారు, చదవడం, రాయడం వచ్చినవారు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతిలో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. కేవలం ఆదివారం రోజుల్లో తరగతులకు నార్కట్‌పల్లిలోని హైస్కూల్‌లో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్ చేయలేని వారు కూడా ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ పొంది ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉమేష్, ఎంఈఓ నర్సింహ, యదనయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పాటుపడాలి

శాలిగౌరారం: సంపూర్ణ అక్షరాస్యత సాధన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాల కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 'తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్)' ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల విద్యాధికారి మందుల సైదులు, ఏపీఎం శంకరయ్య, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఐకేపీ సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ తీవ్ర నిరాశలో ఆశావహులు

మునుగోడు: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయా, తాము ఎప్పుడు పోటీ చేయాలా.. అని రెండేళ్లుగా ఆశతో ఎదురుచూస్తున్న పలువురు బీసీ, ఓసీ కేటగిరీలకు చెందిన ఆశావహులు తీవ్ర నిరాశలో పడ్డారు. మునుగోడు మండల ఎంపీపీ పదవి దక్కించుకోవాలని అనేకమంది బీసీ, ఓసీ నాయకులు కోటి ఆశలతో గ్రామాల్లో తమ గెలుపునకు అవసరమైన మార్గాలను సిద్ధం చేసుకున్నారు. తీరా మునుగోడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు రెండు ఎస్సీ జనరల్ కావడంతో పలువురు చెప్పలేని వేదనలో పడ్డారు. మరికొందరు జెడ్పీటీసీ స్థానానికి పోటీచేసి జిల్లా పరిషత్ చైర్మన్ లేదా ఇతర ఏదైనా పదవులు పొందాలని భావించారు. మరికొందరు ఎంపీపీ స్థానం దక్కకుంటే జెడ్పీటీసీగా అయినా పోటీచేయాలనుకున్నారు. తీరా ఆ రిజర్వేషన్ ఎస్సీ జనరల్ కావడంతో ఇక తాము రాజకీయాల్లో ఉండి పదవులు లేకుండా ప్రజలకు ఏ పని చేయగలమని వాపోతున్నారు. వీటితోపాటు పలు గ్రామాల్లో బీసీ, ఓసీ అభ్యర్థులు సర్పంచ్, ఎంపీటీసీలుగా పోటీ చేయాలని ఆశతో ఎదురు చూశారు. గ్రామాల్లో సైతం తమకు అనుకూలంగా రిజర్వేషన్లు రాకపోవడంతో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దగ్గరికి వెళ్లి తమ పరిస్థితి ఏమిటని, తమకు పోటీచేసే అవకాశం రాకుండా పోయిందని మొరపెట్టుకుంటున్నారు. ఎన్నికల్లో పోటీచేయకుంటే తమ రాజకీయ భవిష్యత్ ఏంటని ఎమ్మెల్యేతో తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న రిజర్వేషన్ల ప్రక్రియ ఏదైనా కారణంతో మార్పులు జరిగితే బాగుండని పలువురు మాజీ ప్రజాప్రతినిధులు ఆశ పడుతున్నారు.

దేవీ శరన్నవరాత్రి వేడుకలు



చిట్యాల : దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



నల్లగొండ : తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ధనలక్ష్మీ మాతగా అమ్మవారు



కేతేపల్లి : దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



నార్కట్‌పల్లి : దసరా గుడి వద్ద పూజలో పాల్గొన్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాలధారులు



నకిరేకల్ : నోములలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



శాలిగౌరారం : మాధారంకలాన్‌లో దుర్గామాత విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రామగిరి (నల్లగొండ): : బీటీఎస్ శ్రీనివాస నగర్ కాలనీలో..

గొర్రెలకాపరులకు బీమా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న రవీందర్

మునుగోడు : గొర్రెలు, మేకలకాపరులు ఏదైనా ప్రమాదంతో మరణిస్తే ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం మునుగోడులో నిర్వహించిన గొర్రెలకాపరుల సంఘం జిల్లా మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. గతంలో వలె గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం గొర్రెలను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాగర్ల మల్లేష్, నాయకులు అవిశెట్టి మల్లేష్, మాలిగ యాదయ్య, నెల్లికంటి రాఘవేంద్ర, ధనంజయ్, శివర్ల సత్తయ్య, ముక్కామల యాదయ్య, నెల్లికంటి నర్సింహ, మర్రి రామలింగయ్య, మెట్టు నర్సింహ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పూర్తిస్థాయి పని కల్పించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: ఎఫ్‌సీఐ గొల్లగూడ గోదాంలో పనిచేస్తున్న క్యాజువల్ మహిళా కార్మికులకు పూర్తిస్థాయి పని కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మంగళవారం ఎఫ్‌సీఐ మేనేజర్ సునీల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదాంలో మహిళా క్యాజువల్ కార్మికులు 40 మంది పనిచేస్తున్నారని, కాంట్రాక్టు వ్యవస్థ వచ్చిన తర్వాత నెలలో 13 రోజులు మాత్రమే వారికి పని దొరుకుతోందన్నారు. కార్యక్రమంలో అవుట రవీందర్, మహిళా కార్మికులు జక్కల లింగమ్మ, కొత్త ధనమ్మ, తవిటి సైదమ్మ, నల్ల లక్ష్మి పాల్గొన్నారు.

2న మాంసం విక్రయ దుకాణాలు బంద్



నోటీసు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

చండూరు : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా చండూరు మున్సిపల్ పరిధిలో మాంసం విక్రయాలు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లేషం తెలిపారు. మంగళవారం చండూరు పట్టణంలో మాంసం విక్రయదారులకు మున్సిపల్ సిబ్బంది నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అధికారిక ఉత్తర్వులు అందజేసివారికి నిషేధం వర్తిస్తుందని, షాపులు తెరిచి మాంసం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించండి



మర్రిగూడ : మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తిప్పర్తి : సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని తిప్పర్తి మండల ప్రత్యేక అధికారి ఛాయాదేవి ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం తిప్పర్తి మండల పరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పీఓలు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ నర్సింహనాయక్, పీఓలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఓలకు శిక్షణ

చండూరు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను మంగళవారం ఎంపీడీఓ యాదగిరి ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో 81 మంది ప్రిసైడింగ్ అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ తరగతులను చండూరు ఆర్డీఓ వందనపు శ్రీదేవి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ మాధవరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు మాదగోని వెంకటేశ్వర్లు, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా మర్రిగూడ మండలంలోని ప్రిసైడింగ్ అధికారులకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పోలింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.చినముసయ్య, ఎంపీఓ రవికుమార్, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, ట్రైనర్స్ ఉదావత్ లచ్చిరాం, బాల్ది రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా విధులు కేటాయించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిట్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపదికను పారదర్శకంగా ఎన్నికల విధులు కేటాయించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు మంగళవారం చిట్యాల ఎంపీడీఓ జయలక్ష్మి, ఎంఈఓ సైదానాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఏశమల్ల నాగయ్య, ఉపాధ్యక్షుడు రంగా రామలింగయ్య, జానకి, మాజీ అధ్యక్షుడు బొప్పని యాదయ్య, కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీనివాస్, శంభయ్య, సాధిక్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న భిక్షంగౌడ్

నల్లగొండ టూటౌన్: రింగ్‌బాల్ క్రీడాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నల్లగొండలో ఎన్జీ కాలేజీలో నిర్వహిస్తున్న టెన్నికాయిట్ పోటీలు మంగళవారం ముగిశాయి. సోమయ్య, రాజేష్ ప్రథమ బహుమతి, శ్రీనివాస్, వెంకన్న ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలకు పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కందికట్ల కరుణాకర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దార సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



గుర్తుతెలియని మహిళ మృతదేహం

కేతేపల్లి: కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ దుర్మరణం చెందగా.. ఈ విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై కొర్లపహాడ్ శివారులోని టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న 70 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహిళను హైవే సిబ్బంది నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందింది. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ ప్రమాదంపై రెండు రోజుల నుంచి ఆరా తీయగా.. కొర్లపహాడ్ వద్ద జరిగినట్లుగా గుర్తించిన ఆస్పత్రి సిబ్బంది మంగళవారం కేతేపల్లి పోలీసులు సమాచారం అందించారు. మృతురాలు భిక్షాటన చేస్తూ రోడ్ల వెంట తిరుగుతున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 87126 70146, 87126 70180 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కేతపల్లి ఎస్ఐ సతీష్ కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామూహిక జన్మదిన వేడుకలు



రిటైర్డు ఉద్యోగులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం భవనంలో రిటైర్డు ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పుట్టినరోజు జరుపుకుంటున్న దుగ్యాల జయమ్మ, షేక్ ఇమామ్, గోపాల్, కొండయ్య, రాంచంద్రారెడ్డి, లింగయ్య, మహ్మమద్ అలీ, కందగట్ల ప్రభాకర్, రాంమోహన్‌రెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రజమంలో సంఘం అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, వీరమల్ల రవీందర్, కందుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కంకర ధరలు తగ్గించాలి

నకిరేకల్ : కంకర ధరలు పెరగడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యార శ్రీను అన్నారు. మంగళవారం ఆయన నకిరేకల్‌లో విలేకరులతో మాట్లాడారు. క్రషర్ మిల్లుల యాజమాన్యాలు కంకర, డస్ట్ ధరలను పెంచారని, అధికారులు చొరవ చూపి వాటి ధరలు తగ్గించాలని ఆయన కోరారు.

మండల ప్రత్యేక అధికారిగా గంజి శ్రీనివాస్



నార్కట్‌పల్లి : మండల ప్రత్యేక అధికారిగా మెప్మా పీడీ గంజి శ్రీనివాస్ మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపిక



ఉమాశంకర్

కనగల్ : ఎన్ఐటీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో కనగల్ మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన ఇరిగి ఉమాశంకర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మంగళవారం నియమితులయ్యారు. ఉమాశంకర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీటెక్, ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమెరికా యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్‌లో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చర్‌గా సేవలందించారు. పాలిమర్ నానో రాడ్ కంపోసిట్స్, అల్ట్రా సాఫ్ట్ కొల్లాయిడ్స్, బ్లాక్ కోపాలిమర్స్‌పై రీసెర్చ్ చేశారు. అమెరికన్ ఫిజికల్ సొసైటీ (చికాగో), ఎడిన్బర్గ్ యూనివర్సిటీ (స్కాట్లాండ్) కాన్ఫరెన్స్‌లలో ఆయన ప్రసంగించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. పదో తరగతిలో బంగారు పతకం సాధించారు.